కలకత్తా

విద్వాన్ సూరిగుచ్చి కృష్ణమూర్తిగారు

"ఇదిగో ఏమండోయి."

"........."

"మాట్లాడరేం మిమ్మల్నే."

"........."

"బాగుంది. ఎక్కడో ఏదో జరగడమూను ఇంట్లో వాళ్ళతో బిగదీసుక్కూచోటమూను. ఇది మరీ బాగుంది లెండి."

"........."

"ఏమిటండీ అంత మౌనవ్రతం. ఏమైనా బాధగా ఉందా?"

"........."

"ఇదుగో చూశారూ! వాళ్ళ వెంకట్రావుకి జంధ్యంలేదని వాళ్ళమ్మ రోజూ కాశీకి ప్రయాణమౌతానని గోలచేస్తున్నదండోయ్. మఱి మనకు జంధ్యంలేకపోయినా అనేవాళ్ళులేరుగా."

"........."

"అయితే పాపయ్యశాస్త్రుల్లు పెళ్ళాన్ని చూశారూ ఆయన్ని నానాతిట్లుతిడుతూ కాళ్ళుకూడా పట్టించుకుంటున్నదండీ. వెతగ్గా వెతగ్గా మనకీపొరుగు దొరికిందేం."

"........."

"ఇదుగో సరేగానీ భక్తసమాజంలోకి పంచములు మహమ్మదీయులూ రాగూడదన్నారుగదా? మఱినిన్న భక్తిమీద ఉపన్యాసం ఇయ్యడానికి ఆతురకపండితుణ్ణి పిలిపించారేం మహాభక్తులందరూను."

"........."

"అబ్బ! ఎంతవాగినా మాట్లాడరేం. ఇక నెప్పుడూ మాట్లాడరా?"

"........."

"ఏదో సామెత చెప్పినట్లుగా మఱి నేను రానప్పుడు వాళ్ళసుబ్బమ్మ వాళ్ళందరితోనూ నాకేమీ తెలియదనీ, బస్తీలల్లో సినీమాలుంటాయనీ, బస్తీలల్లో ఆడవాళ్ళు జడల్లో పిన్నులు పెట్టుకుంటారనీ, డబ్బిస్తే పూటకూళ్ళయిళ్ళల్లో అన్నం పెట్టుతారనీ, రైలుబండి మరతో నడుస్తుందనీ ఇల్లాంటివేమి తెలియవని చెప్పేరటగా? అవునా?"

"........."

మొన్న మాయిస్కూల్లో ఆడవాళ్ళు వేసిన నాటకానికిట మామూలు నాటకాలకు స్త్రీలకు ప్రత్యేకస్థలము అనేట్లుగా మీరు పురుషులకు ప్రత్యేకస్థలము పెట్టకపొయ్యారా అని వాళ్ళ సుభద్రనాన్నగారు ఆక్షేపించారట విన్నారా?

"........."

"ఇదేమిటి బాబూ! ఎన్నిసార్లు ఎంత సరదాగా మాట్లాడుతూన్నా యింత భీష్మించుకుకూచోవడం-నాకెందుకు - పాపం నిన్న వాళ్ళ శకుంతల 'మేష్టరున్నారా?' అని వచ్చి ఎంతోసేపుకూచుని వెళ్ళింది."

"నిజంగానా ఏమన్నది పాపం వెళ్ళేప్పుడు."

"ఆహాఁ శకుంతల అనేప్పటికి వ్రతభంగంచేసుకోవాలిసి వచ్చింది పాపం. ఏదోటి అంది లెండి."

"అబ్బ! చెబుదూ ఏమందో."

"ఏమిటీ అబ్బ-ఇందాకటినుంచీ ఏమైంది బాధ?"

"నాలుగ్గంటలకే నావస్త-ఏం చెప్పిందేమిటి?"

"ఏం చెపుతుంది - తనువచ్చి చాలాసేపు కూచుని వెళ్ళేనని చెప్పమంది."

"ఇంతేనా ఏమీ చెప్పలేదూ?"

"ఏమిటంత ఆరాటం - ఏమున్నదింకా చెప్పడానికి."

"........."

"ఊహూఁ అయిపోయిందిగా కావాలసినసంగతి. మళ్ళీ మొఖం మామూలు-ఏమిటంతచికాకు."

"........."

"పోనీలెండి. నాతో మాట్లాడ్డానికి మీకెంత బాధ్యతో మీతోటి నాకూ అంతే. అసలుసంగతేమిటో

చెప్పకుండా బిగదీసుకుంటే ఎంతసేపని బ్రతిమాలడం. నాలో దోషముంటే ఫలానా అని చెప్పరాదూ. అబ్బో యింత చెట్టయితే ఎల్లాగ బాబూ ఇంట్లోవాళ్ళతోనే. సరేలెండి" అని విసుక్కుంటూ లోపలికి వెళ్ళింది సీత.

సీతకు పదహారేళ్ళుంటాయి. కాపరానికొచ్చి ఓసంవత్సరం పైగా అయింది. చూడతగిన ఆకారం-గంభీరమైన హృదయం - ఆకర్షణీయమైన ప్రవర్తన- తెలివైన వ్యక్తి. చదువుకున్నదికాకపోయినా హిందూపురాణకథలూ, ఆచారవ్యవహారాలూ, ప్రస్తుతవిషయాలూ ఆమెకు బాగా తెలుసు. అయితే పెద్దపెద్దపట్టణాలు ఏవీ చూడలేదు. పట్టుదలగల మనిషి. హృదయంలో ఉన్నంత నిరాఘాటవిశాల దృష్టి క్రియలో గన్పించనీయదు. గుణాగుణాలని గ్రహించే తెలివితేటలు ఎక్కువ.

సీత ఇల్లాంటిది కావడానికి హేతువు రమణ. ఇతనికి చదువు ఎక్కువేగాని సీతలాంటి గంభీర హృదయంలేదు. పదిమందికీయిష్టుడు. ఇతనిదృష్టిలో మానవజాతిలో చిన్నా పెద్దాలేదు. ఇతరులనుగూడా సాధ్యమైనంతవఱకు తనదోవకే తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. ఇతనికి స్త్రీలుచదువుకోవడమన్నా, పత్రికలకు వ్యాసాలురాయడమన్నా, స్త్రీలు గొప్పగొప్పపనులు చేయడమన్నా మహాయిష్టం. సీత పల్లెటూరిపిల్ల అయినా, పుట్టింట్లో ఉన్నప్పుడు యెంత మోటుగా ఉన్నా ఇతనితో కాపురంచేస్తూన్న కొద్దిరోజులకే అన్నివిషయాల్లోను నాజూకూ, నాగరికతా అబ్బినవి. పురుషులకంటె స్త్రీలది నిశితమైనబుద్ధి అనే దృఢవిశ్వాసం రమణకుండడంచేత తనభార్యకు ఈసడించకుండా అన్నివిషయాలు చెప్పడమే సీత యింత తెలివితేటలుగలది కావడానికికారణం.

ఏదైనా ఓచిన్నవిషయమైనా సరే వాదిస్తూంటే పాపం నిజానికి సీతతో మాట్లాడలేకపొయ్యేవాడు రమణ. "ద్రౌపది ఎంతోఓర్పుగలది. లేకపోతే ఆవిడ దిగ్గజాల్లాంటి పతులుగలిగికూడా అల్లాగ విరాటరాజు కొలువులో దాసీపనిచేసి పడరానిబాధలన్నీ పడ్డదే పాపం..."అని రమణఏమన్నా మొదలెడితే వెంటనే సీత వేళాకోళంచేస్తూ "ఓహో ఎవరికోసముంటుం దేమిటి? అవసరమొస్తే ఎవళ్ళుండరు? ఆగొప్పతనం అవసరాందిగాని ద్రౌపది దేముంది? మన దాసీవాళ్ళంతా ఉండడంలే" అని అతనిమాటలను ఉవ్వెత్తుగా ఎగరకొట్టేది నవ్వుతూ. పాపం అతడు ఏమంటాడు. అయితే ఇల్లా సీత మాట్లాడడంలో అభిప్రాయం తను అతనికి అడ్డుతగలాలనే భావమేగాని ద్రౌపది గొప్పతనం గ్రహించక కాదు.

ఒకరోజున "నాలుగువిధాల నాయకులున్నారు. నిశ్చింతుడైఉండేవాడు ధీరలలితుడు" అని ఏమేమో రమణ చెప్పతూంటే "అయితే గేడెల్లూ,దున్నపోతులూను మోటార్లూ అవీ వెళ్ళుతూంటే నదురూ బెదురూలేకుండా నిలబడతైగదా అవి ధీరలలితుడనే నాయకుడికింది కొస్తవా?" అని పరిహసించింది.

రమణకు వంగభాషలో పరిచయముంది. చాలామంది అతనిఆకారాన్ని చూచినా, అతని భాషాజ్ఞానం చూచినా అతడు కలకత్తాలో కొన్నాళ్ళుండి వచ్చేడని అనుకుంటారు. అప్పుడప్పుడూ కొందరు సీతను కూడా ఈవిషయంఅడిగితే ఏమోనండీఅనేది. నిజంగా సీతకూ తెలియదు. అందరూ ఇల్లా అడుగుతూండడం చేత సీతకూసందేహంతోచి ఓనాడు "ఏమండీ! మీరు కలకత్తాలో చదువుకున్నారటగాదూ నిజమేనా?" అని అడిగింది.

"ఎవరన్నారు?"

"వాళ్ళకమంతలా వాళ్ళూ ఎప్పుడూఅడుగుతారు నన్ను."

"అన్నీ వట్టివే. నేనసలు కలకత్తేచూడలేదు."

"మరి మీకదేమిటో అక్కడవాళ్ళు మాట్లాడుకునే భాష వచ్చుటగా."

"వస్తే అది అక్కడేనేర్చుకోవాలని ఉందా, ఇంగ్లీషు నేర్చుకొనేవాళ్ళంతా ఇంగ్లాండులోనే ఉండి నేర్చుకుంటున్నారా?"

"బాగుంది మీ ప్రశ్న-ఇంగ్లీషంత వ్యాప్తిఉందా మీకలకత్తా భాషకు-సరేగానండి. అక్కడ ఆడవాళ్ళు నెత్తిమీద ముసుగువేసుకుని నాజూకుగా ఉంటారటగా."

"ఎవరుచెప్పేరు?"

"శకుంతలని వాళ్ళనాన్న వాళ్ళూ వెళ్ళేప్పుడు తీసుకెళ్ళారట. ఆఅమ్మాయి అక్కడమేడలసంగతీ మనుష్యులసంగతీ చెప్పుతూంటే అమ్మయ్యోఅనిపించేది."

"నేచూల్లేదుగాని పుస్తకాల్లో చదివాను. నిజమే నువ్వు విన్నదంతా. అక్కడ ఆడవాళ్ళకు మనవాళ్ళకంటె చదువూఅవీ ఎక్కువ. వాళ్ళనుతలచుకొని మనవాళ్ళను చూస్తూంటే నాకెంతో విచారంవేస్తుంది."

"పాపం ఎంత జాలిహృదయమండీ మీది. వెనుకటికి ఓమహారాజుగారు కొల్లేట్లో నక్కలు చలితో బాధపడుతున్నాయని జంబుకానాలూ గొంగళ్ళూ పంపించాట్ట నక్కలు వాటినికప్పుకుంటాయని. అల్లా మాకూడా మీమన్నా ఆలోచించండిఉపాయం."

"ఆక్షేపణలకేం. ఏంఆలోచిస్తే తప్పా."

"సరి తప్పన్నానా? దానికేంగాని నేనోటిఅడుగుతాను. ఒప్పుకుంటారూ?"

"ఒప్పుకోకేం అడుగు."

"అసలు మీరుచెప్పేవన్నీ అబద్ధాలే. మనింటికొచ్చే కొండలరావుగారు డాక్టరని చెప్పేరే నాకు మొన్న జ్వరంవచ్చినప్పుడు. ఆయనకేదో పొలాలపనటగా."

"ఎవరుచెప్పేరు? ఇది మరీబాగుంది. ఆయన సర్వే గుమాస్తా అనుకున్నావా? వింటే ఏమనుకుంటారు?"

"చాల్లెండి. ఇంకా సమర్థిస్తారేం. మనకాయన ఇచ్చిన నోటీసులు చూడలే. పోనీగానీండి. వచ్చే సెలవులకు మనం కలకత్తాపోదామూ, నాకదిచూడాలని ఉందండీ.ఏమంటారు?"

"అబ్బో కలకత్తే."

"అబ్బో ఏమిటి, రైలులో కూచుంటే రేపీపాటికి కలకత్తా."

"ఆహా! ఎంత ప్రపంచజ్ఞానం. టిక్కెట్టు కొనక్కర్లే."

"తమకున్నంత తెలివితేటలు లేకపోయినా టిక్కెట్టు కొనాలని నాకూ తెలుసులెండి. మీరనుకున్నట్లు రైలు పురతో నడుస్తుందని తెలియకపోలేదు లెండి."

"కలకత్తాకు టిక్కెటెంతో తెలుసా. మనిద్దరికీ ఓవందరూపాయలు కావాలి."

"అయితే ఏమి, మీరు ప్రతీనాటకానికి వెళ్ళడం ఎందుకు? ఇకమీదట మానేయండి. ఆడబ్బుతో వెళ్ళవచ్చు."

"చూద్దాంలే."

"చూద్దామంటేవెళ్ళిందిఎక్కడికో. ఒప్పుకోండి."

"సరేలే సెలవుల్లోగా."

"అప్పుడేలెండి ఒప్పుకున్నారా?"

ఎల్లాగయితే నేం ఊఁ అనిపించింది సీత రమణచేత. ఆరోజుమొదలుకొని సీతకు కలకత్తా దిదృక్షు అతిశయించింది. పాపం ఆఅమ్మాయి పల్లెటూళ్ళో పెరగడం దగ్గిరున్న చిన్నచిన్న బస్తీలు చూడ్డమేగాని పెద్దపెద్ద పట్టణాలు చూచి ఎరుగదు. చూడాలనే బుద్ధీలేదు. అయితే కలకత్తా ఆడవాళ్ళవైఖరీ వినేసరికి ఎందుకో బుద్ధిపుట్టింది వెళ్ళాలని. ఇది తఱచు వాళ్ళింట్లోఉన్న సరోజనీదేవి బొమ్మని చూడడం మూలాన్నికొంత, శకుంతల మాటలమూలాన్నికొంతా కలిగింది. దినాలులెక్కెడుతోంది యక్షుడు ప్రవాస దినాలను లెక్కపెట్టినట్లుగా సెలవలకోసం.

రమణకుమాత్రం కలకత్తా వెళ్ళి అంతడబ్బు ఖర్చు చేయడం ఇష్టంలేదు. ఎల్లాగ ఈముప్పుతప్పించడం అని ఆలోచిస్తున్నాడు.

కొన్నాళ్ళకు సెలవలూవచ్చినవి. "ఏమండీ రేపేటగా సెలవలు మొదలు" అని అడిగింది సీత.

"అప్పుడే నీకెలా తెలిసింది?"

"వాళ్ళమ్మాయిచెప్పింది. పోనీ చెప్పండి కలకత్తా పోవడం ఇష్టంలేదా?"

"లేకేం, ఒప్పించుకున్నావుగా."

"ఒప్పుకోటానికేం లెండి. మనమేం సత్యహరిశ్చంద్రులమా? పొద్దునలేస్తే మనవోటంటవచ్చేవన్నీ అబద్ధాలేగా."

"వెళ్ళదామంటూంటే ఇంత వ్యాఖ్యానమెందుకు? రేపురాత్రి మెయిలుకే పోదాం."

"నిజమేనా?" అని ఎంతో ముఖం వికసింపచేసుకొన్నది. పాపం సీతకు కలకత్తా పేరు తెలిసిందిగాని మార్గం ఎలా తెలుస్తుంది. ఏలూర్లో రాత్రి మెయిలెక్కితే చెన్నపట్టణం పోతారు.

మరురోజునల్లా ఎంతో సంతోషంగా ఉంది. సామాను పొద్దుటినుంచీ సర్దుకోడం మొదలెట్టింది. రమణ ఆనాడెందుకో తనలోతాను నవ్వుకోడం మొదలెట్టేడు. ఇది ఊరికే తన్ను వేళాకోళం చెయ్యడం అనుకుందిగాని పాపం సీతకేం తెలుసు?

స్టేషనులో రాత్రి సామానుదగ్గర సీతను నిలుచోబెట్టి రమణ చెన్నపట్టణానికి రెండుటిక్కెట్లు కొన్నాడు. తెనుగుదేశం దాటేదాకా రాత్రికావడంచేతా, మొగవాళ్ళపెట్టెలోనే సీతనుకూడా కూచోబెట్టడంచేతా ఎవళ్నూ ఏవూరువెళ్ళుతారు అని సీతను అడగలేదు. అక్కడికీ ఓముసలివితంతువు ఏవూరు తల్లీ అని నిమ్మళంగా అడిగితే ఆవిడను చెవుడేమో అనుకొని బిగ్గరగా కలకత్తా అని చెప్పింది. ఎందుకనో ఆవిడ మళ్ళీ మాట్లాడలేదు.

పట్నంచేరేక తనకో స్నేహితుడు ఆవూళ్ళో ప్లీడరీ చేస్తూంటే సీతతో వాళ్ళింటికివెళ్ళేడు రమణ. వాళ్ళు సగౌరవంగా వీరిని సత్కరించేరు. వెళ్ళగానే తనకు వాళ్ళింట్లోవాళ్ళంతా పాతవారేఅవడంచేత సీతతో ఇది కలకత్తేనని చెప్పుతూండండి అనిచెప్పేశాడు.

క్రిస్టమస్ పండుగలవటంచేత పట్టణం బాగా కలకళ్ళాడుతూఉంది. ఆప్లీడరుగారి మోటారు మీద నాలుగురోజులు ఊరంతాతిప్పేడు సీతను రమణ. గుఱ్ఱపుపందాలు ఆటదగ్గిర ఆగుఱ్ఱాలను సీత సినీమా చూసినట్లుగా చూచింది. ఎంతో ఆనందించింది తన హృదయంలో. ఇంకా ఎన్నోవస్తువులు కొనుక్కుంది కలకత్తామీదున్న అభిమానంతోటి.

అయితే ఇదివరలో బెంగాలీవాళ్ళ కట్టూజుట్టూ విన్నదానికీ ఇక్కడ తానుచూస్తూన్న అరవలవ్యవహారానికీ భేదం చాలాకనిపించింది. ఏఒకరిద్దరో తప్ప నెత్తిమీద ముసుగువేసుకున్న ఆడదే కన్పించలేదు. ఈసంగతి రమణను బీచీదగ్గరకూచున్నప్పుడుఅడిగింది. అడిగితే "అలా ముసుగేసుకోవడం పూర్వకాలపు ఫాషన్. ఇప్పుడు ముసుగుతీయడంఫాషన్‌గాబోలు. నాకుమాత్రం ఏంతెలుసు" అని వస్తూవస్తూన్న నవ్వు నాపుకుంటూచెప్పేడు. సీతకు ఆసముద్రతరంగాలూ హార్బరూ ఎంతోసంతోషాన్ని కలుగచేసినవి.

ప్లీడరుగారికీ ఆయనభార్యకూ సంగతంతా తెలుసు గనుకఇక రేపువెళ్ళుతారనగా ప్లీడరుగారుతాంబూలం వేసుకుంటూ "ఏమమ్మా సీతమ్మా! కలకత్తాబాగుందా" అని మందస్మితంగా అడిగారు. సీత అమాయికంగా "బాగుందండీ ఎన్నాళ్ళనుంచో పోరగాపోరగా నేటికి తర్లారు. చక్కా మీరెంత అదృష్టవంతులండీ! కలకత్తాలోనే కాపురంఉన్నారు" అని అన్నది. ఇంతలోకే ప్లీడరుగారిభార్య అందుకొని "ఏమండోయ్ మా సీత ధర్మంమూలాన్ని కలకత్తానూ చెన్నపట్టణాన్నీ ఒకటేచేస్తారట గవర్నమెంటువారు" అని నవ్వింది. దాంతో సీతకుతప్ప అందరికీ నవ్వువచ్చింది. వీళ్ళ నవ్వులూ సంభాషణలూ సీతకేదో అనుమానం కలిగించాయిగాని అది చెన్నపట్టణం అని తెలియలా పాపం.

తిరిగి మళ్ళీ స్వగ్రామానికి ప్రయాణమయ్యారు రమణా సీతనూ. ప్లీడరుగారి భార్య సీతకు ఓచీరె పెట్టింది. ఎంతో ప్రేమగా ఆదరించి వీడుకొల్పింది. రమణతో అందిగదా ఈమాటు సెలవులకి సీతను చెన్నపట్టణం తీసుకురండి. మేమక్కడ ప్రాక్టీసు పెట్టుకుంటాం అని అంది. రమణ నవ్వుతూ సరేలెండిఅని బయలుదేరాడు.

రైలులో రమణతో సీత మాట్లాడనేలేదు. పట్టుదల ఏమిటంటే వాళ్ళు తనను వేళాకోళంగా నవ్వుతూంటే రమణకూడా వాళ్ళల్లో కలిసి ఎందుకు నవ్వాలి అని ఓటీ. రెండోది స్టేషనుదగ్గిర వాళ్ళఊరి డాక్టరుగారూ ఆయనభార్యా కలిస్తే ఆవిడ సీతతో "ఇదేమిటి? మీరు పట్టణంవచ్చేరా ఏమిటి" అని అడి

గింది. దాంతో సీతకు నిజం తేలింది. రమణ కొంప మునిగిందని అనుకొని సీతను తొందరగా ఇకేమీ ఆవిడతో మాట్లాడనీకుండా బండి ఎక్కించేడు.

ఇంటికిజేరేక అవమానం సీతను ముంచేస్తున్నది. రమణ పాపం ఎన్నోసార్లు బ్రతిమాలాడు. యెన్నో వింతలు చెప్పేడు. ఎన్ని చెప్పినా సీత వినలేదు. చివరకు రమణ అన్నాడుగదా "నాకీసంవత్సరం దిద్దడానికి పేపర్లు వస్తయి. దానికోసం ప్రయత్నం చెయ్యాలని వెళ్ళాను. దానిమూలంగా మూడువందలరూపాయలు వస్తవి. రాగానే అవి నీచేతికేయిస్తాను. దాంతో 'ఈసారి మనం కలకత్తాపోదాము" అని ఒట్టువేశాడు. దీంతో సీత కొంచెం సమాధానపడ్డది. ఈసారి కలకత్తాకు టిక్కెట్లు వాళ్ళ పెదనాన్నకొడుకుంటే అతనిచేత తెప్పింతామనుకున్నది. "పోనీలెండి నేనూ చెన్నపట్టణమే చూద్దామనుకున్నాను. కలకత్తాలో ఏముందేమిటి?" అని తనూ నవ్వింది చివరకు.

కృశాంగి

కొత్తపల్లి సుబ్బణాచార్యులుగారు (సాహితీసమితి)

ఎంతోచక్కని రూపువాఁడవనుచున్ ఎంతోగుణాఢ్యుండ వం
చెంతో జ్ఞానముభక్తిసంపదల నీవెంతోఁ బ్రపూర్ణుండ వం
చెంతో ప్రీతిదలిర్పఁజూతువని యెంతెంతోముదంబార నా
కాంతున్గా నలరారఁజేసిరి నినున్గాదే మనోవల్లభా!

కోరినదెల్లఁ గోరినటుఁగూర్చుచు మోదమెలర్పఁగా మహో
దారులు నన్నుఁగన్నతలిదండ్రులు నాయెడ నెంతొప్రీతితో
నారసి దేశమంతటనునారసి ఆరసి యెట్టకేలకున్
గోరి నిన్ను నాపతిగఁగూర్చుటకై కద! ప్రాణవల్లభా!

హరిచింతారతిలేదు దుర్విషమచింతాసక్తియేగాని యీ
కరణిన్ జేయఁగ నేలొకో! అకట! నీగాంభీర్యమేమాయెనో
చిరకాలంబొకరీతినే గడచునే చిత్రంబుకాదే! యహా!
మరువంబోకుము చిన్ననాటివలపుల్ మాటల్ వినోదావళుల్.

నామనముం గనుంగొనక నాయెడ నక్కటికంబొకింతయున్
నీమనమందునెంచక యనేకవిధంబుల నేడుపించి పెన్
బాములఁద్రోసిపుచ్చితివి పాపనిసైతముఁజూడవైతివే
నేమియొనర్పగాఁగలను? ఏమియొనర్చిన నేమికార్యమా?

నాయపరాధమేమి? నను నల్గురిలో నగుఁబాటుసేసి నన్
బాయఁగనేల? రూపమున బాగుగలేనొ? గుణంబుచాలదో?
ప్రాయముతక్కువో? మఱిప్రపంచమెఱుంగనొ? యేమికారణం
బో? యిటులేలజేసెదవు? పో, తగునా? యిటుజేయఁజెల్లునా?

కాని యెన్నాళ్ళుచేసెదో గాంచుదాన
ధనమదంబును ప్రాయమదంబునుడుగ
రాకమానవు నినుఁజేరనీకపోను!
నీవు నాప్రాణరత్నమై నెగడుకతన.